సాక్షి నిజామాబాద్

శనివారం । 6 । జూలై । 2024



పనులు పూర్తిచేయాలి

జిల్లాలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ ఆదేశించారు.

- 8లో ▸



పాఠశాలలకు నిధుల కొరత

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు సర్కారు నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /26.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జెడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ పాలకవర్గం పదవీ కాలం పూర్తవడంతో కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ శుక్రవారం జిల్లా పరిషత్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో ఉష, పంచాయతీరాజ్ అధికారి శంకర్, ఇతర అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి శనివారం తొలివిడత ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరాంకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగే ధ్రువపత్రాల పరిశీలకు హాజరయ్యే విద్యార్థులు ముందు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 12వ తేదీ వరకు స్లాట్‌బుక్ చేసుకోవడం చివరి తేదీగా ఉందన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్‌లో నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు కౌన్సెలింగ్ హాజరయ్యే వారు ఏప్ సెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, పదోతరగతి, ఇంటర్ మెమోలు, నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు బోనఫైడ్‌లు, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆదాయ ధ్రువీకరణపత్రం ఆధార్ కార్డు, ఒరిజినల్ పత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్‌ను తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు.

నేడు రేబిస్ టీకాల పంపిణీ

డొంకేశ్వర్: జునోసిస్‌డే సందర్భంగా శనివారం జిల్లాలోని పశువైద్యశాలలో ఉచితంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి పశువైద్య శాలలో టీకాలు వేస్తామన్నారు. పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొమ్మిదో తేదీ నుంచి ఇంటర్వ్యూలు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని బేగంపేటలో ఈ నెల 9 నుంచి 17 వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి గల నర్సింగ్ విద్యార్థులు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టామ్‌కామ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ద్వారా జర్మనిలో పనిచేసేందుకు అర్హత కలిగిన నర్సులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9908830438, 8919047600, 7032379066, 8499990304 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరుచుకున్న పచ్చదనం

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం పచ్చదనాన్ని సంతరించుకుంది. నేలపై కిలో మీటర్ల మేర పరుచుకున్న పచ్చగడ్డి నేత్రానందాన్ని కలిగిస్తోంది. అక్కడక్కడ ఉన్న నీటి కొలనులు, పచ్చని ప్రకృతి సందర్శకులను ఆకట్టుకుంటోంది. జింకలు, పశువులకు కూడా దండిగా మేత లభిస్తోంది.

- డొంకేశ్వర్(ఆర్మూర్)



నేడు వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ రాక

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శనివారం రానున్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ఎక్కువ మొత్తంలో ప్రబలుతున్న దృష్ట్యా జిల్లాను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తనిఖీ చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత నూతన కలెక్టరేట్‌లో వైద్యారోగశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

డెంగీ బెల్స్!

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- పారిశుధ్య లోపంతో విజృంభిస్తున్న దోమలు
- వాతావరణ మార్పులతో పెరుగుతున్న జ్వర పీడితులు
- రోగుల నుంచి అందినకాడికి దండుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు
- వివిధ రకాల పరీక్షల పేరిట నిలువు దోపిడీ

జిల్లాలోని పలుచోట్ల డెంగీ జ్వరంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. డెంగీ లక్షణాలతో రోగులు ఆస్పత్రులకు వస్తున్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా వ్యాపిస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య లోపంతో దోమల వ్యాప్తి ఎక్కువవుతోంది. ఇదే అదునుగా ప్రవేటు ఆస్పత్రులు రోగుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నాయి.


నిజామాబాద్‌నాగారం: వాతావారణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్‌లు విజృంభిస్తున్నాయి. చిన్న, పెద్దా తేడా లేకుంటా జ్వరాల బారిన పడుతున్నారు. అయితే జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులు డెంగీ బూచి చూపించి అడ్డగోలుగా రోగుల నుంచి దోచుకుంటున్నారు. జ్వరంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తే చాలు.. వెంటనే వివిధ రకాల టెస్టులు చేయిస్తూ.. వైరల్ ఫీరల్, డెంగీ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తూ రోగులను అడ్మిట్ చేసుకుని వారి జేబులకు చిల్లులు పెడుతున్నారు.

పెరుగుతున్న కేసులు

జిల్లా ఇటీవల కాలంలో డెంగీ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గతేడాది కేవలం 108 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 90కి పైగా కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ కూడా జిల్లాలో ఉన్న పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్‌సెంటర్‌లు, ఏరియా, జిల్లా ఆస్పత్రి, జీజీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన కేసులు మాత్రమే. అయితే వాస్తవంగా కేసులు వందల్లో ఉంటాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరే పేషెంట్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

పర్యవేక్షణ లోపంతో..

జ్వరం వస్తే చాలు ప్రైవేటు ఆస్పత్రులు అడ్మిట్ చేసుకుని అనంతరం డెంగీ పేరుతో ఒక్కో రోగి వద్ద రూ. 40 వేల నుంచి రూ. 60వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రతిరోజూ ఒక్కో ఆస్పత్రికి 40 నుంచి 60కి పైగా మంది రోగులుకు జ్వరంతో చూపించుకోవడానికి వస్తున్నారు. ఇందులో రోజుకు 4 నుంచి 8 మందిని అడ్మిట్ చేసుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు సంబంధించి ల్యాబ్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎస్ఎస్-1 కిట్‌తో టెస్టులు చేసి అడ్మిట్ చేసుకుంటున్నారు. ఈ విషయం తెలిసిన సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కనీసం పర్యవేక్షణ చేయడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.



ప్రైవేటులో లెక్క లేదు..

జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ టెస్టులు చేయడానికి అవకాశం లేదు. ఇందుకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేవు. జ్వరంతో వచ్చిన రోగులకు కేవలం ఎస్ఎస్-1 కిట్‌తో టెస్టులు చేసి డెంగీ పాజిటివ్ వచ్చిందని, రక్తకణాలు తగ్గుతున్నాయని భయపెట్టి మరీ రోగులకు అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నారు. రూ. వేలల్లో ఫీజులు అక్రమంగా దండుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కనీసం ఒక్క పరికరం లేకుండా డెంగీ అని చెప్పడంతో అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

టీ-హబ్‌లోనే ఎలీసా టెస్ట్ సౌకర్యం

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ పేరుతో చికిత్స చేయవద్దు. ఎవరైనా డెంగీ పేరుతో చికిత్స చేస్తే మాకు ఫిర్యాదు చేయండి. డెంగీ టెస్ట్ కేవలం జీజీహెచ్ ఆవరణలో ఉన్న టీ-హబ్‌లో మాత్రమే ఎలీసా టెస్ట్ చేసి నిర్ధారణ చేయడం జరుగుతుంది. ఎస్ఎస్-1 కిట్‌తో టెస్ట్ చేసి డెంగీ పాజిటివ్ అని చెప్పవద్దు. ఎవరైనా అలా చేస్తే శాఖపరంగా చర్యలు ఉంటాయి.

– తుకారాం రాథోడ్, డీఎంహెచ్‌వో

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో వన మహోత్సవంపై డీఎఫ్‌వో వికాస్ మీనాతోపాటు అన్ని శాఖల జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ప్రస్తుత-2024 సీజన్‌లో ఆయా శాఖల వారీగా వన మహోత్సవంలో భాగంగా నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను గుర్తు చేస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు హితవుపలికారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున విరివిగా మొక్కలు నాటాలని, దీన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకుని నిర్ణీత గడువులోపు లక్ష్యం పూర్తిచేయాలని సూచించారు. లక్ష్యాల సాధన కోసం అనువైన స్థలాలను గుర్తిస్తూ, మొక్కలు నాటడంతోపాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని, ఏకకాలంలో ఈ పనులు జరగాలని ఆయన ఆదేశించారు. రానున్న మూడు వారాల్లోపు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వంద శాతం మొక్కలు నాటించాలని గడువు విధించారు.

వనమహోత్సవ కార్యక్రమం ప్రగతి గురించి రోజు వారీగా నివేదికలు సమర్పించడంతో పాటు, వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా కార్యక్రమాలను రూపొందించిన సమయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మండల ప్రత్యేకాధికారులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ పాలక వర్గాలను భాగస్వాములు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ అంకిత్

చిరుత కలకలం

- కమలాపూర్ శివారులో మేకల మందపై దాడి

నవీపేట: మండలంలోని కమలాపూర్-మోకన్‌పల్లి శివారులో చిరుతపులి శుక్రవారం మళ్లీ కనిపించింది. గ్రామానికి చెందిన కటికె గాంధీ తన మేకలను తీసుకుని గుట్ట ప్రాంతంలో మేతకు వెళ్లాడు. సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన చిరుత మేకల మందపై దాడి చేసింది. ఒక మేకను తీవ్రంగా గాయపర్చింది. గమనించిన గాంధీ అప్రమత్తమవడంతో చిరుత పారిపోయింది. మేకల మందను తీసుకుని గ్రామానికి చేరుకున్నాడు. జరిగిన విషయాన్ని ఫారెస్టు అధికారులకు విన్నవించగా నిజామాబాద్ బీట్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ జహూర్ ఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలను సేకరించారు. చిరుత సంచారం నిజమేనని నిర్ధారించారు. ఏడాది క్రితం ఇదే ప్రాంతంలో చిరుతలు కనిపించాయి. కాగా చిరుత ఒకే చోట ఉండదని, ప్రతిరోజూ పదుల కిలోమీటర్లు నడిచే అలవాటు ఉంటుందని ప్రజలు భయపడొద్దని అధికారులు సూచించారు.



వివరాలు సేకరిస్తున్న అటవీ అధికారి

మెగా డీఎస్సీని ప్రకటించాలి

- బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్
- కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం.. తోపులాట, అరెస్టు



పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన నాయకులు



కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్న బీజేవైఎం నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. 'నిరుద్యోగులకు అండగా తెలంగాణ బీజేవైఎం' పేరుతో శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్‌ను ముట్టడించారు. కార్యక్రమానికి ర్యాలీగా వస్తున్న బీజేవైఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. ఈక్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రూరల్ సీఐ సురేష్‌కుమార్, ఎస్సైలు మహేశ్, గంగాధర్ ఆధ్వర్యంలో నాయకులను అడ్డుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీజేవైఎం నాయకుడు సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని, నిరుద్యోగుల కోసం ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా అదేసమయంలో కలెక్టరేట్‌కు వచ్చిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేవైఎం కలెక్టరేట్ ముట్టడికి మద్దతు పలికారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పిల్లి శ్రీకాంత్, బాలు, సాయిరెడ్డి, ప్రశయ్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు.. విడుదల..

నిరుద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడికి బీజేవైఎం పిలుపు నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే జిల్లావ్యాప్తంగా సుమారు వందకు పైగా ముఖ్య నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేసి నాలుగో టౌన్‌కు, రోషన్‌లాల్ బోరాను ఒకటో టౌన్‌కు తరలించారు. ఈసందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యదేశంలో ప్రతిఒక్కరికీ ప్రశ్నించేహక్కు ఉంటుందన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

క్లుప్తంగా

రీకౌంటింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీఈడీ 1, బీపెడ్ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల రీవాల్యుయేషన్ / రీకౌంటింగ్ కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11లోపు రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.500 ఫీజు, రీకౌంటింగ్‌కు రూ.300 చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కేజీబీవీలో..

మోపాల్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నాన్ టీచింగ్ స్టాఫ్ కోసం అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో సుప్రజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన వంట మనిషి, స్కావెంజర్, నైట్ వాచ్‌మన్‌తోపాటు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 11లోగా కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

8న డిగ్రీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్‌అర్బన్: మునిపల్లిలో ఉన్న మహాత్మజ్యోతి బాపూలే మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలకు ఈనెల 8న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సత్యనాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ(ఈపీహెచ్), బీకాం(సీఏ), బీకాం(బీఏ), బీఎస్సీ(బీజెడ్‌సీ) ఎస్‌జెడ్‌సీ, ఎంపీపీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్ గ్రూపులలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9121167316 నంబరును సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ వన్‌టైం చాన్స్ పరీక్షలు

డిచ్‌పల్లి: తెయూ పరిధిలోని డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ 5, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 156 మందికి 145 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 22 మందికి 22 మంది హాజరైనట్లు తెలిపారు. వర్సిటీ పరిధిలో నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, కామారెడ్డిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో డిగ్రీ వన్‌టైం ఛాన్స్ పరీక్షలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా జీపీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

వర్ని: జీపీ కార్యదర్శుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా ధర్పల్లి మండలం కొత్తపల్లికి చెందిన జీపీ కార్యదర్శి రెబ్బ సుమన్, జిల్లా కార్యదర్శిగా వర్ని మండలం జాకోర కార్యదర్శి హెచ్ శ్రావణ్,కోశాధికారిగా భీమ్‌గల్ మండలం గొనుగపుల కార్యదర్శి వినీల్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ చైర్మన్

నిజాంసాగర్ (జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని ముగ్దుంపూర్ గ్రామానికి చెందిన చింతకింది రామచందర్ గౌడ్ శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గునుకుల్ సొసైటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన రామచందర్‌గౌడ్ ఆయన కాంగ్రెస్‌లో చేరారు.

పాఠశాలలకు నిధుల కొరత

- గ్రాంట్స్ విడుదలలో అలసత్వం
- హెచ్‌ఎంల సొంత నిధులతో ఖర్చు



ఏర్గట్ల ఉన్నత పాఠశాల భవనం

మోర్తాడ్: పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత వెంటాడుతోంది. పాఠశాలలకు ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తుంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒక్కో పాఠశాలకు రూ.25 వేల నుంచి రూ. 75 వేల వరకు కేటాయిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభం కాగానే ఎస్‌ఎంసీ ఖాతాల్లో నిధులను జమ చేసేది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం పాఠశాలల విషయంలో నిర్లక్ష్యం వహించింది. నిధులు అవసరం ఉన్న సమయంలో కేటాయింపులు జరుపకుండా, ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో నిధులు కేటాయించి వెంటనే ఖర్చు చేయాలని ఆదేశించేది. దీంతో అప్పట్లో బిల్లులు సరిగా లభించక, నిధులను వినియోగించడానికి ప్రధానోపాధ్యాయులు నానాతంటాలు పడేవారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం మాదిరిగా విద్యా వ్యవస్థపై అలసత్వం ప్రదర్శించబోమని కాంగ్రెస్ నేతలు అనేక సభల్లో చెప్పారు. కానీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. పాఠశాలలు తెరుచుకోవడంతో పాటు తరగతులు ప్రారంభమయ్యాయి. చాక్‌పీసులు, రిజిష్టర్లు, ఇతర స్టేషనరీ ఎంతగానో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గతంలో నిర్ణయించిన ప్రకారం 100 మంది విద్యార్థులు ఉంటే రూ.25వేలు, 101 నుంచి 150 మంది విద్యార్థులు ఉంటే రూ.50వేలు, 151 నుంచి 300 మంది వరకు విద్యార్థులు ఉంటే రూ.75వేల చొప్పున నిధులను కేటాయించాల్సి ఉంది. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 1,234 ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మాత్రం ఆశించిన విధంగానే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్కూల్ గ్రాంట్స్ ఎంతో అవసరం. ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే ప్రధానోపాధ్యాయులే తమ సొంత నిధులతో వీటిని ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేస్తే ఖర్చులు పారదర్శకంగా జరపడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన బోధన సామాగ్రి కొనుగోలు చేసే అవకాశం ఉంది.

నిధులు కేటాయించాలి

పాఠశాలలకు నిధులను సకాలంలో విడుదల చేయాలి. స్టేషనరీ కొనుగోలు ఎంతో అవసరం. హెచ్‌ఎంలపై భారం పడకుండా ప్రభుత్వమే నిధులను విడుదల చేయాలి.

– గుండోజి రవీందర్, తపస్ జిల్లా నాయకుడు

ఉత్సవంలా అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న నికాల్‌పూర్ ప్రజలు



రుకుంబాయి మృతదేహం

డొంకేశ్వర్(ఆర్మూర్): అమ్మలా అభిమానించే ఆలయ పురోహితురాలు పరమపదించడంతో ఆమెకు ఘనమైన వీడ్కోలు పలకాలని నిర్ణయించారు ఆ గ్రామస్తులు. అంత్యక్రియలను ఉత్సవంలా నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. పురానికి హితము చేకూర్చేవారు పురోహితులు.. దీనికి అతికినట్లు సరిపోతారు నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి చెందిన రుకుంబాయి(84). ఊళ్లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద సుమారు యాభై ఏళ్లుగా పూజారిగా పనిచేస్తున్న ఆమె.. అందరి తలలో నాలుకలా మెదిలారు. దీంతో గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా రుకుంబాయి వద్దకు వచ్చి చెప్పుకునేవారు. ఆమెతో చెప్పుకుని అమ్మవారికి మొక్కితే సమస్యలు తీరుతాయని విశ్వసించేవారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సైతం ఆమె అంటే అభిమానం.ఆమె వృద్ధాప్యం తోపాటు ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మరణించారు. ఊరందరి అభిమానాన్ని చూరగొన్న ఆమెకు ఘనమైన వీడ్కోలు పలకాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ట్రాక్టర్‌పై సింహాసనం ఏర్పాటు చేసి భౌతిక కాయాన్ని అందులో ఉంచారు. బోనాల పండుగను తలపించేలా అంతిమ యాత్ర నిర్వహించారు. అంత్యక్రియల్లో మహిళలూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాల్‌కల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పోకిరీల ఆగడాలు



తరగతి గది తలుపు, తాళం పగులగొట్టిన దుండగులు

మోపాల్: విద్యాలయాన్ని దేవాలయంగా భావించే రోజుల్లో మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోకిరీలు సభ్యసమాజం సిగ్గుపడేలా వ్యవహరించారు. వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల తరగతి గది తాళాలు పగులగొట్టి, తలుపులను ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా వరండా, తరగతి గది, జెండా గద్దె వద్ద మలమూత్ర విసర్జన చేశారు. తరగతి గదుల్లో నల్లబోర్డులు, గోడలపై అసభ్యకరంగా బొమ్మలు వేసి, రాతలు రాశారు. గ్రామానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించిన వారిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోకిరీలను గుర్తించే పనిలో గ్రామ, అమ్మ ఆదర్శ కమిటీలు నిమగ్నమయ్యాయి. గతంలో పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాలనుసైతం ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. పాఠశాల హెచ్‌ఎం హరినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎడపల్లి సెక్షన్ సమస్యలను పరిష్కరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: అస్తవ్యస్థంగా ఉన్న ఎడపల్లి సెక్షన్ సమస్యలను పరిష్కరిస్తామని బోధన్ డీఈ ముక్తార్ అన్నారు. సాక్షిలో ప్రచురితమైన 'అస్తవ్యస్థంగా ఎడపల్లి సెక్షన్' కథనానికి డీఈ ముక్తార్ స్పందించారు. గతంలో పని చేసిన ఏఈ బదిలీపై వెళ్లడంతోనే ఏబీ స్విచ్‌లు సెక్షన్‌లో అలాగే ఉన్నాయని అవసరం లేని వాటిని వెంటనే స్టోర్‌కు తిరిగి పంపించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మరో మూడు రోజుల్లో ఏఈ ద్వారా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. వినియోగదారుడు సాయన్న పనులు, టవర్ విషయంలో పనులు పూర్తి చేస్తానని ఇది వరకే చెప్పాను. ఎడపల్లికి పూర్తిస్థాయి ఏఈ, ఏడీఈలు లేకపోవడంతో కాస్త ఆలస్యం అవుతోంది. పనులు ఆలస్యం కాకుండా చూసుకుంటామని పేర్కొన్నారు.

'కాసర్ల' కవితకు అంతర్జాతీయ బహుమతి



డాక్టర్ కాసర్ల నరేశ్

మోపాల్(నిజామాబాద్ రూరల్): జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ కాసర్ల నరేశ్ రావుకు కెనడా నుంచి వెలువడే అంతర్జాతీయ పత్రిక 'తెలుగు తల్లి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచస్థాయి కవితల పోటీల్లో బహుమతి లభించింది. ఈమేరకు పత్రిక నిర్వాహకుల నుంచి కాసర్ల నరేశ్‌రావుకు శుక్రవారం సమాచారం అందింది. గత మే నెలలో ఈ ప్రపంచ స్థాయి కవితల పోటీకి ఆహ్వానం పలకగా, వివిధ దేశాల్లో ఉండే తెలుగు కవులు 180 మంది తమ కవితలు పోటీకి పంపించారు. పోటీలో డాక్టర్ కాసర్ల రచించిన 'ముసలి గది' అనే కవిత మొదటి ఐదు స్థానాల్లో నిలిచింది. మూడు దశాబ్దాలుగా నిజామాబాద్ సాహిత్య రంగంలో తనదైన ముద్రతో ముందుకు వెళ్తున్న కాసర్ల.. ఇప్పటివరకు పది పుస్తకాలను రచించారు. కాసర్ల ప్రస్తుతం మోపాల్ మండలం సిర్‌పూర్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు. అంతర్జాతీయ కవితా బహుమతిని అందుకోనున్న కాసర్ల నరేశ్‌రావును ఇందూరు కవులు వీపీ చందన్‌రావు, డాక్టర్ పింగళి గంగాధర్ రావు, రంగాచార్య, నర్సింహ స్వామి, డాక్టర్ శార ద, డాక్టర్ గంట్యాల, చింతల అభినందించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తిచేయాలి



సిర్‌పూర్‌లో మాట్లాడుతున్న డీఈవో దుర్గా ప్రసాద్



ధర్మారంలో పనులను పరిశీలిస్తున్న డీఈవో

మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. శుక్రవారం నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాల్లోని సిర్‌పూర్, నర్సింగ్‌పల్లి, ధర్మారం, ధర్మారం తండా, మల్లారం పాఠశాలలతో పాటు మోపాల్‌లో కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిర్‌పూర్‌లో తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పాఠశాల, తల్లిదండ్రులు, ఊరికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి జీపీఏ పాయింట్లు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నాణ్యతతో చేపట్టాలని, అగ్రిమెంట్‌లో పొందుపర్చిన విధంగా పనులు చేయాలని ఆదేశించారు. అనంతరం డీఈవోను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులున్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

బాల్కొండ: హరితహారంలో భాగంగా చేపడుతున్న వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో మండల పరిషత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వన మహోత్సవానికి నాటే మొక్కల గుంతల పనులను వేగవంతం చేయాలన్నారు. గతంలో నాటిన మొక్కల స్థానాల్లో చనిపోయిన మొక్కలుంటే వేరేవి నాటాలన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, పీవో ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కూలర్‌లోని నీటిని తొలగిస్తున్న డీఎంహెచ్‌వో

నిజామాబాద్‌నాగారం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలు దరిచేరవని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. నగరంలోని గాయత్రి నగర్‌లో శుక్రవారం ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణ ఆరోగ్యకేంద్ర సిబ్బంది, పర్యవేక్షకురాలు శాంతకుమారి, ఏఎన్‌ఎం విఠాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ విద్యుత్ డీఈపై విచారణ

నిజామాబాద్ నాగారం/ఆర్మూర్ టౌన్: విద్యుత్ శాఖలో ఆర్మూర్ డివిజనల్ ఇంజినీర్ హరిచంద్ నాయక్‌పై ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆర్మూర్ డీఈ కార్యాలయంలో విచారణ చేపట్టారు. డీఈ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. తనకు దగ్గరగా ఉండే ఉద్యోగుల ద్వారా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. డివిజన్‌లో ఏ పని కావాలన్నా కాంట్రాక్టర్లు డీఈకి సన్నిహితంగా ఉండే ఉద్యోగులకు ముడుపులు అందించాలి. ఆయన అక్రమాలపై ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి, ఏపీటీఎస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మరో నాలుగు రోజుల పాటు విచారణ చేయనున్నామని సీఐ తెలిపారు. కాగా విచారణ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఒకరిపై కేసు నమోదు

గాంధారి: అటవీ భూమి విషయంలో కక్షలు పెంచుకుని ఒకరి ఇంటిపై దాడి చేసిన ఘటన మండలంలోని రాంపూర్‌గడ్డ తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన రాజా, దస్రు కుటుంబాల మధ్య అటవీ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. పాత కక్షలతో రాజా అనే యువకుడు దస్రు ఇంటిపై దాడి చేసి కిటికీల అద్దాలు, టీవీ ఇతర వస్తువులను ధ్వంసం చేశాడని బాధిత కుటుంబీకులు తెలిపారు. విచారణ చేపట్టి దాడి చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో రోగి అదృశ్యం

- విలపిస్తున్న కుటుంబీకులు
- పట్టించుకోని అధికారులు



అదృశ్యమైన రఫికబేగం

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ అదృశ్యమైంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రఫికబేగం అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 2న జీజీహెచ్‌కు వచ్చారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. నాలుగు రోజులుగా ఆమెకు చికిత్స అందుతోంది. శుక్రవారం ఉదయం రఫికబేగం ఆస్పత్రి నుంచి అదృశ్యమైంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు జీజీహెచ్ వైద్యులు, నర్సింగ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ వారు స్పందించకపోవడంతో డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఒకటోటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. రఫికబేగం అదృశ్యంతో కుటుంబీకుల బోరున విలపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కడుపునొప్పితో ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

ఖలీల్‌వాడి: కిడ్నీ సమస్యతో పాటు విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్న కండక్టర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాందేవ్‌వాడలో శుక్రవారం చోటు చేసుకుంది. మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం కల్లూర్ గ్రామానికి చెందిన ఈరవత్రి శ్రీనివాస్(28) ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్‌కు కిడ్నీలో రాళ్లు రావడంతో కొన్ని రోజులుగా బాధపడుతున్నాడు. దీంతో కల్లూర్‌కు వస్తూ విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారింది. జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో రూమ్ అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి కిడ్నీలతో కడుపునొప్పి విపరీతంగా రావడంతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం విషయం గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

బాల్కొండ: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిట్టాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై యాసర్ అర్పాత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాడ రాజేశ్వర్(68) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో అధికంగా మద్యం సేవిస్తుండడంతో అనారోగ్యానికి గురయ్యాడు. వారం రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి శ్రీరాంపూర్ శివారులో ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాడ గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్షణికావేశంలో చెరువులో దూకి..



అంజవ్వ మృతదేహం

పిట్లం: ఇంట్లో జరిగిన గొడవకు ఓ మహిళ క్షణికావేశంలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మారేడ్‌చెరువులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అంజవ్వ(38)కు ఇంట్లో కుటుంబీకులతో గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో మారేడ్‌చెరువులో పడి దూకింది. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు జాలర్ల సాయంతో అంజవ్వ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతిరాలి తల్లి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ, పోలీసులు

బాల్కొండ: మండల కేంద్రంలో వన్నెల్(బి) కూడలి వద్ద ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై యాసర్ అర్పాత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

మోర్తాడ్: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మశ్చేందర్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. ఏర్గట్ల పీఎస్ పరిధిలోని తాళ్లరాంపూర్ నుంచి దోంచంద వెళ్లే మార్గంలో రెండు బైక్‌లు ఢీకొనగా దోంచందకు చెందిన శాంసన్(27) గురువారం రాత్రి మృతి చెందాడు. ఒక బైక్‌పై ఉన్న అనిల్‌కు తీవ్రగాయాలు కాగా మరో వాహనంపై ఉన్న శ్రవణ్, అశోక్, నిఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీతారాంనగర్ కాలనీలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని సీతారాంనగర్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై అశోక్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబీకులతో కలిసి 10 రోజుల క్రితం అమెరికాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు రాత్రి వేళ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాను ధ్వంసం చేయగా నగదు లభించక పోవడంతో వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి 7 నెలల జైలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడికి ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక ఏడు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన గుజ్జరి నాగరాజు గతేడాది సెప్టెంబర్ 30న అయ్యప్ప ఆలయంలో చోరీకి పాల్పడడంతో అతడిపై కేసు నమోదైంది.విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఏడు నెలల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.నాగరాజును జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

ఒకరిపై కేసు నమోదు

వర్ని: మండల కేంద్రంలోని కల్లు దుకాణంలో బాల కార్మికుడితో పనిచేయిస్తున్న యజమాని రాజేశ్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణకుమార్ పేర్కొన్నారు. అసిస్టెంట్ చైల్డ్ లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు ఫిర్యాదు మేరకు కల్లు దుకాణ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా చిన్నపిల్లలతో పనులు చేయిస్తే వారిపై శాఖపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని రాజు వెల్లడించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



గాంధారి: మండలంలోని కరక్‌వాడిలో శుక్రవారం ఓ ఇంట్లో ఉంచిన 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు శుక్రవారం పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన ఒడుసుల సంతోష్, పత్తి నవీన్ కరక్‌వాడిలో పీడీఎస్ బియ్యం సేకరించి అదే గ్రామానికి చెందిన చిట్టి ప్యాకల సాయిలు ఇంట్లో అక్రమంగా దాచి ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు సాయిలు ఇంట్లో సోదా చేయగా 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సేకరించిన బియ్యాన్ని మండల కేంద్రానికి చెందిన కందుకూరి వెంకటేశం అనే వ్యాపారికి విక్రయిస్తున్నట్లు చెప్పారు. సాయిలు, సంతోష్, నవీన్, వెంక టేశంపై కేసు నమోదు చేసి బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించినట్లు ఎస్సైపేర్కొన్నారు.

కందర్‌పల్లిలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి రోడ్డులో గురువారం రాత్రి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కందర్‌పల్లి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 4క్వింటాళ్ల50 కిలోల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రికవరీ ఫోన్ల అప్పగింత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పీఎస్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న 15 మంది బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం పేర్కొన్నారు. ప్రజలు రైల్వేస్టేషన్, బస్టాండ్, మార్కెట్, రద్దీ ప్రాంతాల్లో తమ వస్తువులు, ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.